

అందోల్: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



అందోల్: ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ముదిరాజ్‌లు

# ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- బీఆర్‌ఎస్ అందోల్ అభ్యర్థి కాంత్రికిరణ్
- జోగిపేటలో భారీగా ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం
- వేలాదిగా తరలివచ్చిన ముదిరాజ్‌లు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్‌కు సంపూర్ణ మద్దతు
- కాంగ్రెస్ మాటలింటే మోసపోతం
- పిషనరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్
- బోనాలు, శివసత్తుల ఆటలతో మార్మోగిన జోగిపేట

అందోల్, నవంబర్ 18: తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌లకు పెద్దపీట వేస్తున్నదని అందోల్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. శనివారం జోగిపేటలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్, పిషనరీస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లందరికీ అన్నిరకాలుగా అండగా ఉన్నది బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కటే అన్నారు. అందుకు కృతజ్ఞతగా మీరందరూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించి కేసీఆర్ మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని ముదిరాజ్‌ల బతుకులు ఎంతో దుర్భరంగా ఉండేవని ఉన్న ఊర్లో ఉపాధి లేకా ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముదిరాజ్‌లకు చెరువులపై హక్కులు కల్పించడం, చేప పిల్లలు అందజేయడం, వ్యాపార నిర్వహణకు వాహనాలు, ఇతర పనిముట్లు అందజేసి ఆర్థికంగా అండగా ఉండడంతో బతుకుల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. సబ్సిడీ రుణాలు, బీసీ బంధు పథకంలో సైతం ముదిరాజ్, మత్స్యకారులకు ప్రాధాన్యతనిస్తూ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరొక్కసారి గెలిపించుకుంటే మన బతుకుల మరింత మెరుగుపడుతాయన్నారు. కాంగ్రెస్ మాటలు విని ఆగంకావొద్దని మనకు అండగా ఉండే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలకు, చేసే పనులకు సంబంధం ఉండదని వారు ఎన్నికల్లో ఇచ్చే హామీలన్నీ బూటకమేనన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ అహంకారి అని అందోల్‌కు శనిలా దాపురించాడని ఓటమి భయంతో దాడులకు సైతం దిగుతున్నారన్నారు. వారి అరాచకాలు ఆపాలంటే దామొదర్‌ను అందోల్ నుంచి శాశ్వతంగా సాగనంపాలన్నారు.

### కాంగ్రెస్ మాటలింటే మోసపోతం

గ్రామాల అభివృద్ధి, ప్రజాసంక్షేమంపై మంచి విజన్ ఉన్న నాయకుడు క్రాంతికిరణ్ అని ఆయనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి అందోల్‌ను మరింత అభివృద్ధి బాటలో నడిపించేలా ఆశీర్వదించాలని పిషనరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ఎల్లవేళలా మనకు అండగా ఉండే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి అండగా ఉండి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు అందోల్‌పై పూర్తి పట్టున్న నాయకుడు క్రాంతికిరణ్ అని మరోసారి ఎమ్మెల్యే అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తాడన్నారు. ముదిరాజ్‌ల మద్దతు క్రాంతికిరణ్‌కే అంటూ మద్దతు తెలిపారు.

### ఆత్మీయ సమ్మేళనానికి భారీ స్పందన

జోగిపేటలో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అందోల్–జోగిపేట మున్సిపాలిటీతోపాటు అందోల్, వట్‌పల్లి, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మునిపల్లి, రాయికోడ్, పుల్కల్, చౌటకూర్ మండలాల నుంచి నాయకులు, యువత పెద్దఎత్తున తరలిరావడంతో జోగిపేట–సంగారెడ్డి ప్రధాన రహదారి గులాబీమయమైంది. సమ్మేళనంలో అందోల్ గడ్డ క్రాంతికిరణ్ అడ్డా...జై కేసీఆర్, జై బీఆర్‌ఎస్ అంటూ నినాదాలు చేస్తూ నృత్యాలు చేశారు. మహిళలు బోనాలతో తరలి రాగా...శివసత్తుల పూనకాలతో జోగిపేట మార్మోగింది. అంతకుముందు జోగిపేటలో పెద్దఎత్తున్న ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకురాలు మందుల వరలక్ష్మి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, నాయకులు నారాయణ, గంగాధర్, నాగభూషణం, శివశేఖర్, వెంకటేశం, సునీల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గొర్ల కాపరుల సంఘం రాష్ట్ర చైర్మన్ బాల్‌రాజ్
పక్కన సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యక్రమానికి హాజరైన గొల్లకురుమలు

# మోసపోయి గోస పడొద్దు

- బీఆర్‌ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి
- హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ గెలవడం తథ్యం
- సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలి
- గొర్లకాపరుల సంఘం రాష్ట్ర చైర్మన్ బాల్‌రాజ్

కొండాపూర్, నవంబర్ 18: నియోజకవర్గంలో మరోసారి మోసపోయి గోసపడొద్దని గొర్లకాపరుల సంఘం రాష్ట్ర చైర్మన్ బాల్‌రాజ్ గొల్ల కురుమలకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో చింతా ప్రభాకర్, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గెలుపు ఖాయమన్నారు. కురుమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నేత శ్రీహరి అధ్యక్షత గొల్ల కురుమల ఆత్మీయ సమ్మేళనం శనివారం మల్కాపూర్‌లోని గోకుల్ గార్డెన్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాల్‌రాజ్ మాట్లాడుతూ కారుగుర్తుకు ఓటేసి సంగారెడ్డిలో చింతా ప్రభాకర్‌కు గెలిపించాలన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో మొదటి విడుతలో 32 కోట్లు, రెండో విడుతలో రూ.2 కోట్లతో గొర్రెల పంపిణీ చేశామని గుర్తు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన 3 గంటల విద్యుత్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. చింతా ప్రభాకర్ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజల మనిషిగా కొనియాడారు. ఆయన గత ఎన్నికల్లో ఓడినా ప్రజలకు సేవచేశారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తిని గుండెల్లో పెట్టుకొని గెలిపించాలని కోరారు.

### ప్రజలే నా బలగం

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలే నా బలం–బలగమని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఈసారి ఓటేస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో శ్రీహరి, పట్నం మాణిక్యం, మామిళ్ల రాజేందర్, నరహరిరెడ్డి, బీరయ్య యాదవ్, మ్యాకం విఠల్, కిష్టయ్య, శ్రీకాంత్, బాగయ్య, సత్యనారాయణ, ప్రదీప్, మల్లేశం, బాలయ్య, రవి, అనంతయ్య, దశరథ, శంకర్, జలందర్, వీరన్న, శ్రీశైలం, రమేశ్, రాంచందర్ పాల్గొన్నారు.

# జోరుగా సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లు

## పటేల్‌గూడ ఎల్లెంకి కాలేజీ సమీపంలో సభాప్రాంగణం



సీఎం సభ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 18: పటాన్‌చెరు నియోజకవర్గంలో జోరుగా సీఎం కేసీఆర్ సభా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని ఎల్లంకి కాలేజీ సమీపంలోని సీఎం సభా స్థలాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీబీలతో, ట్రాక్టర్లతో, బుల్డోజర్లతో స్థలాన్ని చదునుచేస్తున్నారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 23న సీఎం కేసీఆర్ పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటేల్‌గూడకు వస్తున్నారన్నారు. సువిశాలమైన ఈ గ్రౌండ్‌లో సీఎం సభ జరుగుతుందన్నారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు సభకు భారీ హంగులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి లక్షమంది కార్యకర్తలు సభకు రానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలన్నీ సీఎం సభ విజయవంతం కోసం కృషి చేస్తున్నాయన్నారు.



శనివారం వెల్దుర్తి మండల పరిధిలోని ఆరెగూడెం, ఉప్పలింగాపూర్, తండా, ఏదులపల్లి, రామాయిపల్లి, బండపోసాన్‌పల్లి, శెట్‌పల్లి, బస్వాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

# కాంగ్రెస్ మ్యానిఫెస్టో బూటకం

## మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్



నారాయణఖేడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

నారాయణఖేడ్, నవంబర్ 18: కాంగ్రెస్ మ్యానిఫెస్టో బూటకమని, కుర్‌కురే ప్యాకెట్ వంటిదని రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. శనివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందు ఆరు గ్యారంటీల పేరుతో విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ఇప్పుడు 66అంశాలతో వెల్లడించడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను పరిశీలిస్తే కుర్‌కురే ప్యాకెట్ మాదిరిగా గాలితో నిండిన పాలిథిన్ కవర్‌లా ఉన్నదన్నారు. ఆ మ్యానిఫెస్టోలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క అంశం కూడాలేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మొదటి ఐదేండ్లలో వనరులు సమకూర్చేందుకు, ఆ తర్వాత ఐదేండ్లు ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. ఈసారి సమగ్ర మ్యానిఫెస్టోతో బీఆర్‌ఎస్ ప్రజల ముందుకొచ్చిందన్నారు. తెలంగాణలో అధికారం చేపడితే కర్ణాటక మాడల్ అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. అక్కడి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిన ఫలితంగా ఏడాదిలో 3,065 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మత్స్యరంగం అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులు వెచ్చించడంతో ఎనిమిదేండ్లలో 33 వేల కోట్ల టన్నుల చేపలను ఉత్పత్తి చేశామని చెప్పారు. మత్స్య రంగానికి సంబంధించి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలకు మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి కారుగుర్తుకు ఓటేసి మూడోసారి సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టడంతోపాటు నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే విద్యాభివృద్ధి సాధించామని రాష్ట్ర లెక్చరర్ల ఫోరం ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్ అన్నారు. 2016లో మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గం విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, రంజిత్, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, మాజీ ఎంపీటీసీలు ముజామిల్, రామకృష్ణ పాల్గొన్నారు.